సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



ఖాతాదారుల డబ్బు స్వాహా
వర్ని కెనరా బ్యాంకులో ఖాతాదారులు జమ చేసిన పొదుపు డబ్బులను బ్యాంకు సిబ్బంది సొంతానికి వాడుకున్నారు.
- 8లో ▸



ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి
విధుల్లో ఉన్న పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని పోలీస్ కమిషనర్ నాగరాజు సూచించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.9 /19.3

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండ తీవ్రం గా పెరుగుతుంది. సాయంత్రం చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు తెయూలో జాతీయ సదస్సు
• హాజరు కానున్న గవర్నర్ తమిళిసై

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ, అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో శనివారం 'ఇండియాస్ జీ 20 ప్రెసిడెన్సీ ఛాలెంజ్ అండ్ ప్రాస్పెక్ట్స్ ఫర్ ఇండియా యాజ్ ది గ్లోబల్ లీడర్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వీసీ డి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా గవర్నర్, వర్సిటీ ఛాన్సలర్ తమిళిసై సౌందరరాజన్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు కంప్యూటర్ సైన్స్ కాలేజీ సెమినార్ హాల్‌లో ఈ సదస్సు జరుగుతుందన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచాలి



బాల్కొండ : హరితహారం లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను పెంచాలని సీసీఎఫ్(చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) శర్వానన్ అన్నారు. గురువారం మెండోరా మండలం పోచంపాడ్‌లోని ఫారెస్ట్ నర్సరీని ఆయన పరిశీలించారు. నర్సరీలో రూ.ఏడు లక్షలతో నిర్మించిన లేథ్ హౌస్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. లేథ్ హౌస్‌లో ట్రేలు ఏర్పాటు చేసి మొక్కల నారు పెంపకం ప్రారంభించాలన్నారు. ప్రస్తుత సంవత్సరం ఫారెస్ట్ నర్సరీకి రెండు లక్షల మొక్కలు పెంపకం చేపట్టేల లక్ష్యం ఉందన్నారు. నాణ్యమైన మొక్కలను పెంచి సరఫరా చేయాలన్నారు. మొక్కలు ఎండిపోకుండ క్రమం తప్పకుండ నీరు అందించాలన్నారు. డీఎఫ్‌వో వికాస్ మీనా, ఎఫ్‌డీవో భవాని శంకర్, ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్, ఎఫ్‌ఎస్‌వోలు గణేష్, శ్రీకాంత్, సౌమ్య ఉన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్‌లో విజిలెన్స్ తనిఖీలు

నిజామాబాద్ నాగారం : నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో గురువారం హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన ముగ్గురు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. అధికారులు అకస్మికంగా తనిఖీలకు రావడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు హడలెత్తిపోయారు. విభాగంలో పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. శుక్రవారం కూడా తనిఖీలు కొనసాగనున్నాయి.

'ధాత్రి టౌన్‌షిప్'లో పనులు వేగవంతం చేయాలి
• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సుభాష్‌నగర్: నగర శివారులోని మల్లారం పరిధిలో ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన ధాత్రి టౌన్‌షిప్ వెంచర్‌లో మౌలిక సదుపాయాల కల్పన కోసం చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. గురువారం నగర శివారులోని మల్లారం గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన ధాత్రి టౌన్‌షిప్‌ను ఆయన సందర్శించారు. క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. తొలివిడతగా గతేడాది నవంబర్‌లో వేలం పాట నిర్వహించిన ప్లాట్లు పరిశీలించి, వాటికి సంబంధించిన వివరాలు అడిగితెలుసుకున్నారు. టౌన్‌షిప్‌లో మౌలిక సదుపాయాల కల్పన పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని ఆరా తీశారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీవో రవి, నిజామాబాద్ రూరల్ తహసీల్దార్ అనిల్, టీఎస్ఐఐసీ జిల్లా మేనేజర్ దినేశ్ తదితరులున్నారు.

జాతీయ అవార్డుకు నేరల్ పంచాయతీ ఎన్నిక



గాంధారి: జాతీయ పంచాయతీ అవార్డుకు మండల పరిధిలోని నేరల్ గ్రామ పంచాయతీ ఉమెన్ ఫ్రెండ్లీ విభాగంలో ఎంపికైనట్లు పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ అన్నారు. గురువారం ఆయన గ్రామాన్ని సందర్శించి అధికారులు, గ్రామస్తులు, మహిళలతో మాట్లాడారు. పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎల్పీవో సురేందర్, ఎంపీడీవో సతీష్, సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ సునీత పాల్గొన్నారు.

శిఖం.. ఖతం..!



2545 సర్వేనంబర్ భూమిలో మొరం పోస్తున్న దృశ్యం

• నగరంలోని ఖిల్లా ప్రాంతంలో 15 ఎకరాలు కబ్జా!
• రికార్డులు సృష్టించి ఆక్రమించుకున్న అక్రమార్కులు
• వ్యవహారంలో అధికారుల మాయాజాలం
• భూమి విలువ రూ. 32 కోట్లపైనే..
• తాజాగా ఎకరం 17 గుంటల్లో మొరం పోస్తున్న వైనం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఖిల్లా ప్రాంతంలో సర్వే నంబర్ 2545లో 15ఎకరాల శిఖం భూమి కబ్జాకు గురైంది. ఈ వ్యవహారంలో అక్రమార్కులకు అధికారులు వత్తాసు పలికి రికార్డులను తారుమారు చేసినట్లు తెలుస్తోంది. ఈ భూమిని తమ వశం చేసుకునేందుకు అధికారులకు ముడుపులు సమర్పించి దొంగపత్రాలు సృష్టించారు. అయితే ఈ భూమిపై సదరు అక్రమార్కులు 2016 నుంచే కన్నేశారు. తాజాగా అన్ని రికార్డులను అధికారులతో పద్ధతి ప్రకారం మార్పించినట్లు తెలుస్తోంది. తాజాగా ఒక ఎకరం 17 గుంటల భూమిలో మొరం నింపుతున్నారు. ఈ భూమి ఏళ్ల తరబడిగా రెవెన్యూ, సర్వే రికార్డులో శిఖం భూమిగా ఉంది. గతంలో తహసీల్దార్‌లు, ఆర్డీవో సైతం సర్వే చేయించి 15 ఎకరాలు చెరువు శిఖం భూమి అని పంచానామా చేయడంతో పాటు నివేదిక ఇచ్చారు. ఏళ్ల తరబడిగా ఈ భూమిలో డంపింగ్‌యార్డుగా వాడారు. కానీ ప్రస్తుతం ఈ భూమి కబ్జాకు గురైంది.

జరిగిందిలా..

సర్వే నంబర్ 2545లో సుమారు 15 ఎకరాల చెరువు శిఖం భూమి ఉంది. 1965 నుంచి 2015 వరకు రికార్డుల్లో శిఖం భూమిగానే నమోదై ఉంది. కానీ అక్రమార్కులు 1965 కంటే ముందే 1955 వసూలు బాకీలో భాగంగా నాగారం సాయి అనే వ్యక్తి పేరుపై ఇనామ్ భూమి ఉన్నట్లు రికార్డుల్లో సృష్టించారు. తర్వాత నాగారం సాయి వారసులమంటూ చెప్పుకుని ఈ భూమి కోసం కొన్నేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరిగి చివరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణం భూమిలో డంపింగ్ యార్డు ఉండగా.. మూడెకరాలు ఒక వ్యక్తికి, మరో మూడెకరాలు ఒక్కో వ్యక్తికి చెందినదని, మిగతా భూమిలో శ్మశానాలు ఉన్నట్లు అప్పటి నిజామాబాద్ తహసీల్దార్ విశ్వనాథం తన పంచనామా నివేదికలో ధ్రువీకరించినట్లు సృష్టించారు. ఇందుకు సంబంధించిన పూర్తి నివేదిక గల కరెక్షన్ ఫైల్ ల్యాండ్ అండ్ సర్వే ఏడీ కార్యాలయంలో ఉండేలా జాగ్రత్త పడ్డారు. ఈ నివేదికను ఇద్దరు ఆర్డీవోలు, ముగ్గురు తహసీల్దార్లు సమర్థించినట్లు కూడా సృష్టించారు. 2016లో ఓ సర్వేయర్‌ను ఈ భూమిని పరిశీలించడానికి పంపించారు. సదరు సర్వేయర్ డంపింగ్‌యార్డు, శ్మశానాలు మినహా ఐదున్నర ఎకరాల ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉందని నివేదిక ఇచ్చాడు. అయితే ఈ భూమిలో నుంచి ఎకరన్నర ప్రభుత్వం నుంచి పట్టా పొందినట్లు ఒక వ్యక్తి రికార్డులు సృష్టించి దానిని ఇతరులకు విక్రయించాడు. ఆ భూమిని కొనుగోలు చేసిన ఒక వర్గానికి చెందిన నాయకుడు.. మరో ఐదు ఎకరాలు తన పేరున 1980లోనే మార్పిడి జరిగినట్లు ధ్రువీకరించే విధంగా రికార్డులు సృష్టించారు. ఐదెకరాలు కరెక్షన్ జరిగినట్లు ఫైల్ సృష్టించి కబ్జాదారుడికి అందజేశారు. 1980లో కరెక్షన్ జరిగిన ఫైల్ ఇటీవల టీపాన్ మ్యాప్‌లో రావడంతో రెవెన్యూ ల్యాండ్ సర్వే అధికారుల పనితీరు వెనుక ఎన్ని మామూళ్లు చేతులు మారాయో ఊహించవచ్చు. అయితే మరో రెండున్నర ఎకరాలు ఇంకో వ్యక్తి పేరిట ఉన్నట్లు సృష్టించారు.

డంపింగ్ యార్డు స్థలంలో మొరం

డంపింగ్ యార్డు స్థలాన్ని స్వాహా చేసేందుకు రికార్డులను మార్చేసిన అక్రమార్కులు భూమిని తమ స్వాధీనంలోకి తీసుకునేందుకు గురువారం నుంచే మొరం పోస్తున్నారు. సదరు స్థలంలో ప్రైవేటు వ్యక్తులు దర్జాగా మొరం పోస్తున్నా మున్సిపల్, రెవెన్యూ, సంబంధిత అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడడం లేదు.

స్థలంపై 2016 నుంచే కన్ను

నగరంలోని ఖిల్లా ప్రాంతంలో కొత్తగా మినీ ట్యాంక్ బండ్ నిర్మించడంతో కబ్జాదారులు ఈ భూమిపై కన్నేశారు. మార్కెట్‌లో ఈ భూమికి మంచి డిమాండ్ ఉంది. మొత్తం 15 ఎకరాల శిఖం భూమి విలువ రూ. 32 కోట్లపైగానే ఉంటుంది. దీంతో ఈ భూమిని అక్రమార్కులు ఎలాగైనా స్వాహా చేయాలని 2016 నుంచే స్కెచ్ వేశారు. ఇందులో భాగంగా అధికారులకు భారీ మొత్తంలో డబ్బులు ముట్టజెప్పడంతో 2545 సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులను మార్చేశారు. అధికారులు రికార్డుల మార్పిడి తతంగం ముగించి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. ఈ వ్యవహారంలో మాజీ కార్పొరేటర్ మధ్యవర్తిత్వం వహించి సుమారు రూ. కోటితో ఈ పనిని ముగించినట్లు తెలిసింది.

భూమిని కాపాడాలని ఫిర్యాదు

ఖిల్లాలోని డంపింగ్ యార్డు భూమిని కాపాడాలని పలువురు నాయకులు అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నెల 20న నిర్వహించిన బడ్జెట్ మీటింగ్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్ బబ్లూ ఖాన్ భూమి కబ్జా విషయమై ప్రస్తావించారు. కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ ఖైసర్ ప్రభుత్వ భూమిని కాపాడాలని మున్సిపల్ కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు.

మాట్లాడుతున్న తిరుమల్‌రెడ్డి, పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, డీఎస్‌వో తదితరులు



'ఆహార భద్రత'పై అవగాహన అవసరం

• రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి

సుభాష్‌నగర్: జాతీయ ఆహార భద్రత చట్టం -2013పై అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్‌లో చట్టం అమలుపై ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు ఐఏఎస్ హోదా రావడంపై అభినందనలు తెలియజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో తిరుమల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆహార ప్రాముఖ్యతను గ్రహించాలని, పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన శరీర నిర్మాణం జరిగినప్పుడే దేశాభివృద్ధి లక్ష్యాలు, ఫలాలు చేరుకోవచ్చన్నారు. మంచి మానవ సంపద నిర్మాణం కోసమే ఆహార భద్రతకు చట్టరూపం చేసుకున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అన్ని సక్రమంగా అందుతున్నాయా, అధికారులు, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, పరిశీలన, తదితర వాటి కోసమే కమిషన్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. చట్టంపై ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగానికి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆహార భద్రత చట్టం అమల్లో జిల్లా వెనకబడి ఉందని, ఇప్పటివరకు మూడు సార్లు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులకే అవగాహన లేకుంటే ఎలా అని ప్రశ్నించారు. విజిలెన్స్ కమిటీ సమావేశాలు, కమిటీల నియామకం, రేషన్ డీలర్ల ఖాళీల భర్తీ, సోషల్ ఆడిట్ ఎందుకు నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్లకు కూడా వెళ్లడం లేదని తన పరిశీలనలో తేలిందని తిరుమల్‌రెడ్డి స్పష్టంచేశారు. తద్వారా లబ్ధిదారుల నుంచి బియ్యం కోతపై ఫిర్యాదులు వస్తున్నాయని, మరోసారి కమిషన్ దృష్టికి వస్తే చర్యలు ఉంటాయని, పరిహారం చెల్లించాల్సి ఉంటుందని డీలర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవోలు రాజేశ్వర్, రవి, డీఎస్‌వో చంద్రప్రకాశ్, డీఎం జగదీష్‌కుమార్, అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేగంగా వంతెనల నిర్మాణం

• మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: వేల్పూర్‌లో పెద్దవాగు, మోతెలో కప్పలవాగుపై రికార్డు స్థాయిలో హైలెవల్ వంతెనల నిర్మాణం పూర్తయిందని రహదారులు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన వేల్పూర్ వద్ద రూ. 15 కోట్లతో, మోతె వద్ద రూ. 12 కోట్లతో నిర్మించిన వంతెనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణాలు కేవలం నాలుగు నెలల్లోనే పూర్తయ్యాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏ నిర్మాణం ఇంత త్వరగా పూర్తి కాలేదన్నారు. ఇంజినీర్లు రాత్రింబవళ్లు దగ్గరుండి పనులు చేయించడం అభినందనీయమన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో బాల్కొండ నియోజకవర్గానికి అత్యధిక నిధులు మంజూరు చేయిస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. అంతకుముందు ప్రశాంత్‌రెడ్డిని వేల్పూర్‌లో గ్రామస్తులు డప్పువాయిద్యాలతో ప్రధాన రహదారి నుంచి వంతెన వరకు ఘనంగా ఊరేగించారు. కార్యక్రమాల్లో డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఎంపీపీ బీమజమున, జెడ్పీటీసీ అల్లకొండ భారతి, ఏఎంసీ చైర్మన్ అరుణ, వైస్‌చైర్మన్ నల్లరమేశ్, సర్పంచ్ తీగెల రాధామోహన్ తదితరులు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో వంతెనను ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

సురేందర్‌రెడ్డి వంతెనగా ఏకగ్రీవ తీర్మానం
వేల్పూర్ : వేల్పూర్ పెద్దవాగుపై నిర్మించిన హైలెవల్ వంతెనకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తండ్రి దివంగత వేముల సురేందర్‌రెడ్డి వంతెనగా నామకరణం చేస్తూ గురువా రం స్థానిక జీపీ పాలకవర్గం, వీడీసీ సభ్యు లు ఏకగ్రీవంగా తీర్మానించారు.

పుస్తెలమ్మి గల్ఫ్‌కు వెళ్తున్నారు..

• గల్ఫ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదు
• మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

రామారెడ్డి/కామారెడ్డి రూరల్/ కామారెడ్డి టౌన్/ లింగంపేట్/సదాశివనగర్/గాంధారి : రాష్ట్రంలో ఉపాధి కరువై తమ భార్యల మెడల్లో పుస్తెలు అమ్మి గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారని మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శుక్రవారం కామారెడ్డి పట్టణ కేంద్రంలో, రూరల్ లో, రామారెడ్డి, అడ్లూర్‌లో, గాంధారిలో ఆయన ప ర్యటించారు. రామారెడ్డిలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కాలభైరవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో మాట్లాడారు. తాను ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు గల్ఫ్ ఫెడరేషన్ ద్వారా రూ. 1,000 కోట్లతో గల్ఫ్ దేశాలకు పంపిస్తే, అక్కడి మోసాలను అరికట్టవచ్చని చెప్పినప్పటికీ సీఎం కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. అసెంబ్లీలో మాట్లాడుదామంటే మైక్‌లు కట్ చేస్తున్నారన్నారు.

మద్యంపై ఆదాయంలో దేశంలోనే టాప్..
మద్యంపై ఆదాయంలో తెలంగాణ దేశంలోనే టాప్‌గా నిలిచిందని ఈటల పేర్కొన్నారు. రూ. 4 కోట్ల జనాభా ఉన్న తెలంగాణలో రూ. 45 వేల కోట్ల ఆదాయం కేవలం తాగుడు మీదే సర్కారుకు వస్తుందన్నారు. తాగే మద్యం సీసాలు అమ్మితేనే వచ్చే ఆదాయం రూ. 10,700 కోట్లని పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణను మద్యంలో ముంచేశారన్నారు. పెట్రోల్, డీజి ల్‌పై వ్యాట్ ద్వారా లీటర్‌కు రూ. 37 వసూలు చేస్తోందన్నారు. 24 కోట్ల జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో మద్యం ద్వారా ప్రభుత్వానికి రూ. 30 వేల కోట్లే ఆదాయం వస్తుంటే రూ. 4 కోట్ల జనాభా ఉ న్న తెలంగాణలో రూ. 45 వేల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. 70 లక్షల డ్వాక్రా సంఘం మహిళలకు పావలా వడ్డీ డబ్బులు ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే కౌలు రైతులకు కూడా రైతుబీమా కల్పిస్తామన్నారు. బీజేపీ సీనియర్ నేత మేదరి సందీప్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు ఈటల సమక్షంలో బీజేపీలో చేశారు. 2018లో కేసీఆర్ నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీ ఎందుకు నిలబెట్టుకోలేదో పార్టీ మారిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను ప్రశ్నించాలన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



బోధన్‌లోని రైల్వేగేట్‌ను పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్

• ఎంపీ ధర్మపురి అర్వింద్

బోధన్‌టౌన్ : రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. గురువారం బోధన్‌లో ఆయన పర్యటించారు. పట్టణంలో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయాన్ని, రైల్వేగేట్ ను పరిశీలించారు. అనంతరం అంబేడ్కర్, శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ప్రత్యేక జిల్లా కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షా శిబిరాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేంద్రం బడ్జెట్‌లో అనేక సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించిందని తెలిపారు. రాష్ట్రంలో 411 రైల్వే బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా మాధవ నగర్ ఆర్‌వోబీ పనులు ప్రారంభించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. మంత్రి వేములకు దమ్ము ఉంటే బ్రిడ్జిని త్వరితగతిన పూర్తి చేయించాలని సవాల్ చేశారు. భవిష్యత్‌లో బోధన్ రైల్వే జంక్షన్ అవుతుందన్నారు. బోధన్-బీదర్ రైల్వేలైన్ సర్వే పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, త్వరలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ బోధన్ నుంచి ప్రారంభం అవుతుందన్నారు. బోధన్‌లో త్వరలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పా టు చేస్తామని వెల్లడించారు. బాలరాజు, మాసిని వినోద్, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, సుధాకర్ చారీ, సర్పంచ్ శ్రీధర్ ఉన్నారు.

దేశాన్ని దోచుకునేందుకు పన్నాగాలు
నిజామాబాద్‌సిటీ: తెలంగాణలో నిధులను, భూములను దోచుకున్న సీఎం కేసీఆర్ ఇప్పుడు దేశాన్ని దోచుకునేందుకు పన్నాగాలు పన్నుతున్నారని ఎంపీ అర్వింద్ అన్నారు. గురువారం నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్(ఏ), లక్ష్మాపూర్ గ్రామంలో కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి దేశాన్ని దోచుకోకుండా కాపాడుకోవాలన్నారు. అనంతరం మల్కాపూర్ నుంచి ముబారక్‌నగర్ వరకు బైక్ ర్యాలీ తీశారు. నాయకులు దినేష్ కులాచారి, పద్మారెడ్డి, జగన్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ కవితను కలవాలంటే తీహార్ జైలుకు వెళ్లాల్సిందే'

రాబోవు రోజుల్లో ఎమ్మెల్సీ కవితను కలవాలంటే తీహార్ జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఎంపీ పేర్కొన్నారు. ఇటీవల నిజామాబాద్‌కు వచ్చిన మంత్రి కేటీఆర్ పెద్ద మనుషుల గురించి ప్రస్తావిస్తూ వ్యంగంగా మాట్లాడారని.. తాను పెద్ద మనిషి కొడుకును, పెద్దమనిషినే అవుతానని, బ్రోకర్ కొడుకు బ్రోకర్ అవుతాడని హేళన చేశారు. తన తండ్రి డీఎస్, నాటి సీఎం వైస్ రాజశేఖరరెడ్డితో కొట్లాడి 42 సీట్లు ఇప్పించకపోతే తెలంగాణలో టీఆర్ఎస్‌కు భవిష్యత్ ఉండేది కాదని గుర్తు చేశారు.

కబ్జాల కింగ్ ఎమ్మెల్యే షకీల్

ఎడపల్లి : బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ కబ్జాల కింగ్‌గా మారారని ఎంపీ అర్వింద్ ఆరోపించారు. గురువారం జానకంపేటలో నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన్ ఎమ్మెల్యే అభివృద్ధిని విస్మరించి, తన వ్యాపారాలను పెంచుకుంటున్నారని ఆరోపించారు.

నకిలీ పట్టాల కలకలం

• నగరంలో వెలుగుచూస్తున్న ఘటనలు
• రంగంలోకి టాస్క్‌ఫోర్స్!
• హైదరాబాద్ కేంద్రంగా నకిలీ సర్టిఫికెట్లు
• కొందరిని విచారించిన పోలీసులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలో భూ కుంభకోణాలు పెరిగిపోతున్నాయి. నకిలీ పట్టాలు సృష్టించి అక్రమార్కులు రూ.కోట్లు సంపాదిస్తున్నారు. కొంతమంది కలిసి భూ దందాకు తెరలేపారు. ఈ నకిలీ పట్టాల వ్యవహారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నేతలతో పాటు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, అధికారులు ఉన్నారు. భూమి అమ్మకాల ద్వారా వచ్చిన లావాదేవీల్లో తేడాలు రావడంతో వివాదాలు బహిర్గతమవుతున్నాయి. ఓ ప్రధాన పత్రికకు చెందిన విలేకరి సైతం ఈ వ్యవహారంలో ఉండడం చర్చనీయాంశంగా మారింది. నకిలీ పట్టాలు సృష్టించి, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బ్లాక్‌మెయిల్ చేసి రిజిస్ట్రేషన్లు చేయించిన సందర్భాలు ఉన్నట్లు తెలిసింది. గతేడాది కూడా అక్రమాలపై 'సాక్షి'లో కథనాలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగడంతో అక్రమాల కథ మళ్లీ తెరపైకి వచ్చింది.

పోలీసులకే బురడీ..

నిజామాబాద్ నగరంలో కోట్లు విలువ చేసే భూమి తక్కువ ధరకు వస్తుందని పోలీసులను బురడీ కొట్టించాడు ఓ రియల్‌ఎస్టేట్ బ్రోకర్. దీంతో సదరు వ్యక్తిని నమ్మి నలుగురు పోలీసు అధికారులు సుమారు రూ.50 లక్షలు చెల్లించారు. ఈ భూమికి చెందిన అసలు పట్టాదారు రావడంతో వివాదం చోటు చేసుకుంది. పోలీసులు తాము చెల్లించిన డబ్బులు రాబట్టుకునేందుకు నగర పోలీసులతో గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిసింది.

అదుపులో కొందరు..

నగరంలో నకిలీ పట్టాల వ్యవహారం పలువురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలిసింది. నాలుగైదు రోజుల నుంచి టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా రహస్యంగా విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఇందులో కొందరిని అదుపులోకి తీసుకోవడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలతో పాటు ఓ విలేకరి, రియల్ ఎస్టేట్ బ్రోకర్ల పేర్లు తెరపైకి వస్తున్నాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసులు నకిలీ ప ట్టాల వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ వ్య వహారంలో పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి, కొంద రిని తప్పించే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కాంగ్రెస్ నేత వీడియో వైరల్

నకిలీ పట్టాల వ్యవహారంపై ఓ కాంగ్రెస్ నేత మాట్లాడిన వీడియో వైరల్‌గా మారింది. సదరు వీడియోలో నేత మాట్లాడుతూ తమ అనుచరులు భూమికి సంబంధించిన పట్టాలను పక్కాగా తయారు చేశారని, కానీ నకిలీ పట్టాల వివాదం బయటకు ఎలా పొక్కిందో తెలియని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నాడు.

హైదరాబాద్‌లో పత్రాల తయారీ

భూముల ధరలు పెరగడంతో కబ్జాదారుల ముఠాలు ప్రభుత్వ భూములు, వారసులు లేని భూములు, వివాదాలు ఉన్న భూములపై ముందుగా కన్నేస్తారు. నకిలీ పట్టాలు, రికార్డులు, పహాణీలు సృష్టిస్తారు. వీటిని తయారు చేయడానికి కావాల్సిన నకిలీ సర్టిఫికెట్లను హైదరాబాద్ కేంద్రంగా తయారు చేస్తారు. అక్కడే పట్టాలతోపాటు స్టాంపులు తయారు చేస్తారు. ఈ నకిలీ పట్టాతో సదరు వ్యక్తులు కబ్జాలోకి వెళ్తారు. అసలు పట్టాదారులు వస్తే రికార్డుల పేరిట కాలం వెళ్లదీస్తారు. అవసరమైతే బెదిరింపులకు పాల్పడతారు. పోలీస్‌స్టేషన్‌కు వెళితే తమ పలుకుబడిని ఉపయోగించి సెటిల్‌మెంట్ చేసుకుంటారు.

గతంలో హస్తం పార్టీ నేతపై దాడి!

నాగారంలోని ఓ సర్వే నంబర్‌లో వచ్చిన విభేదాలు తలెత్తడంతో నకిలీ పట్టాల వ్యవహారం బయటకు వచ్చింది. అంతేకాకుండా కలెక్టరేట్ సమీపంలో ఓ భూ వివాదంలో గతంలో కాంగ్రెస్ నే తను కొట్టినట్లు ప్రచారం జరిగింది. దాడి సమయంలో సదరు విలేకరి అక్కడే ఉన్నాడని తెలిసింది. ఈ భూ వివాదం ఇప్పటికీ కొనసాగుతున్నట్లు సమాచారం.

వంద గజాలకు రూ.4 లక్షలు

దుబ్బా ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాల పేరిట వంద గజాల స్థలానికి రూ. 4లక్షల వరకు వసూలు చేశారు. అలాగే ఈ వ్యవహారం రూ. కోట్లలో జరిగినట్లు తెలిసింది. దుబ్బా ప్రాంతంలోని ప్రభుత్వ స్థలాలు, వారసులు లేనివి, కాలువ ఉన్న ప్రాంతాలు కబ్జాకు గురై ఇప్పుడు అక్కడ షాపులను ఏర్పాటు చేశారు. ఈ స్థలాల ద్వారా ప్రభుత్వానికి రూ. కోట్లలో ఆదాయం వస్తుంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు చొరవ చూపి ప్రభుత్వ భూముల వివరాలు తీస్తే కబ్జారాయుళ్ల గుట్టురట్టు అవుతుందని నగర ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 171మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు గురువారం 171మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ తెలిపారు. ఉదయం జనరల్‌లో 474 మందికి గాను 459మంది విద్యార్థులు హాజరయ్యారు. 15మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 356మందికి 306మంది విద్యార్థులు హాజరయ్యారు. 50మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్‌లో 822మందికి 793మంది విద్యార్థులు హాజరయ్యారు. 29 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ 488మందికి 401మంది హాజరయ్యారు. 87మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో, విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు.

రేషన్ డీలర్లకు కమీషన్ పెంచాలి



సుభాష్‌నగర్: నగరంలో ఒక్కో రేషన్ షాపునకు 1200 వరకు రేషన్‌కార్డులు ఉండేలా చూడాలని, కమీషన్ క్వింటాలుకు రూ.200 వరకు పెంచాలని రేషన్ డీలర్ల అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు నగరంలోని కొత్త కలెక్టరేట్‌లో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ తిరుమల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రేషన్‌దుకాణాల సమస్యలపై అధికారులతో చర్చించారు. డీలర్ల కమీషన్ క్వింటాలుకు రూ.70 చెల్లిస్తున్నారని, రూ.200లకు పెంచాలని విజ్ఞప్తిచేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పోల్కం గంగాకిషన్, కార్యదర్శి ప్రవీణ్ యాదవ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై కుక్కల దాడి



కుక్కల దాడికి గురైన బాలుడు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో గురువారం ఓ బాలుడిపై కుక్కలు దాడి చేయగా వెంటనే స్థానికులు గమనించి కాపాడారు. కాలనీకి చెందిన దోండిబా అనే బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటుండగా కుక్కల గుంపు అతడి వద్దకు వచ్చి దాడి చేశాయి. వెంటనే స్థానికులు గమనించి, కుక్కలను తరిమివేయడంతో ప్రమాదం తప్పింది. కుక్కల దాడితో దోండిబా షర్టు చిరిగింది.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి



సిరికొండ: మండలంలో 2010 నుంచి 2015 మధ్యన ఆధార్ కార్డు పొందిన ప్రజలు తప్పకుండా వారి ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని ఆధార్ కేంద్రం నిర్వాహకుడు గోపి తెలిపారు. న్యావనందిలో ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్యేక కేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోకుంటే ఇన్‌యాక్టివ్ అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఓటరు కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్‌బుక్, గ్యాస్ సిలిండర్ బుక్ ఏదైనా గుర్తింపు పత్రం తీసుకొచ్చి ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

వరల్డ్ ప్రింటర్స్ డే
Since 1957
ఆయుర్వేద వైద్యశాల
ఆపరేషన్ లేకుండా చికిత్స
❖ పైల్స్ ❖ ఫిషర్ ❖ ఫిస్టుల్లా
మొ॥ లగు దీర్ఘకాలిక వ్యాధులన్నింటికి చికిత్స
బ్రాంచ్: ఉమ్మెడ, నిజామాబాద్, హెడ్ బ్రాంచ్: షాపూర్‌నగర్, జీడిమెట్ల, Hyd
79955 38494, 96660 13385

ప్రింటర్స్ డే శుభాకాంక్షలు
మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ప్రింటర్స్ డే శుభాకాంక్షలు.
సిరివెన్నెల ఆఫ్‌సెట్ ప్రింటర్స్
జవహర్ రోడ్, నిజామాబాద్
(గ్రీన్ జనార్దన్)
Cell: 9441154199



సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ HOUSE FOR SALE: Bhagyanagar Colony, Near new Collector office, East facing, 112 gaz, Price 35 Lakhs. Cell: 9603843319 [K- 1232769]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9058509586 [G-781850]

■ హైదరాబాద్‌లోని ఓల్డేజ్ హోం కొరకు రెసి॥ లేడీ కేర్‌టేకర్స్, రెసి॥ వంటవారు (వ. 35-40) & ఆయాలు కావలెను. మంచి జీతం, ఫ్రీ వసతి+భోజనం. ఫోన్: 9700006699, 7981467036 [H-793518]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఖాతాదారుల డబ్బులు స్వాహా

- వర్ని కెనరా బ్యాంక్‌లో రూ.30 లక్షలు మాయం
- బ్యాంక్ అధికారులను నిలదీసిన బాధితులు



వర్ని : తమ భవిష్యత్ అవసరాల కోసం చిరు వ్యాపారులు, కూలీలు జమ చేసుకుంటున్న డబ్బులను ఖాతాల్లో జమ చేయకుండా బ్యాంక్ సిబ్బంది స్వాహా చేశారు. రోజు వారీగా డబ్బులు ఇస్తున్న ఖాతాలో వేయకుండా సొంతానికి వాడుకున్నారు. వర్నిలోని కెనరా బ్యాంక్‌లో ఖాతాదారుల పీడీ అకౌంట్‌లోని డబ్బులు రూ.30 లక్షల వరకు బ్యాంక్ సిబ్బంది స్వాహా చేశారు. వర్నిలోని వంద మందికి పైగా చిరు వ్యాపారులు, దినసరి కూలీలు ప్రతి రోజు రూ.వంద నుంచి రూ.500 వరకు బ్యాంక్ పీడీ ఖాతాలో జమ చేసుకుంటున్నారు. బ్యాంక్ అధికారులు నియమించుకున్న ఏజెంట్ శ్రీనివాస్ వ్యాపారుల వద్ద నుంచి రోజు వారీగా పొదుపు డబ్బులు వసూలు చేసి, వారి ఖాతాలో జమ చేయాలి. కానీ కొన్నేళ్లుగా ఆ డబ్బులను ఖాతాలో వేయడం లేదు. ఈ ఖాతాలోని డబ్బులను రెండేళ్ల తర్వాత ఎప్పుడైనా తీసుకునే అవకాశం ఉంది. దీంతో పలువురు మధ్యలో కొంత మొత్తం విత్‌డ్రా చేసుకుంటారు. అయితే రోజూ వారీగా వసూలు చేసిన డబ్బులను ఏజెంట్ పక్కదారి పట్టించాడని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కొందరు వ్యాపారులు తమ ఖాతాలో ఉన్న డబ్బుల వివరాలు తెలుసుకునేందుకు బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీశారు. తమ వ్యక్తిగత ఖాతాలో పొదుపు డబ్బులు జమ కావడం లేదని తెలియడంతో ఆందోళన చెందారు. 15 రోజులుగా ఖాతాదారులు డబ్బుల కోసం బ్యాంక్ చుట్టు తిరుగుతున్నారు. మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు పొంతన లేని సమాధానం చెబుతు కాలం వెళ్లదీస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గురువారం సుమారు 30 మంది ఖాతాదారులు బ్యాంక్‌కు వెళ్లిన మేనేజర్ సునీల్‌ను నిలదీశారు. విచారణ చేస్తామని మేనేజర్ చెప్పారు. తమ ఖాతాల్లో డబ్బులు జమ చేయకపోతే ఆందోళన చేపడుతామని బాధితులు అంటున్నారు.

నా ఖాతాలో డబ్బులు లేవు



నేను 2017 నుంచి రోజు వారీ గా రూ.వంద చొప్పున కెనరా బ్యాంక్ పీడీ ఖాతాలో జమ చే స్తున్నా. మధ్యలో కొంత మొత్తం విత్‌డ్రా చేసుకున్నా. ప్రస్తు తం రూ.39,400 ఉండాలి. కానీ రూ.5,430 మాత్రమే ఉన్నాయి. బ్యాంక్ అధికారులు పట్టించుకోవ డం లేదు.
– ఆరీఫ్‌ఖాన్, చిరు వ్యాపారి, ఎస్‌ఎస్‌పురం, వర్ని

పొదుపు డబ్బులు జమ చేయాలి



2018 నుంచి బ్యాంక్‌లో పొదుపు చేస్తున్నా. రూ.10వేల జమ డబ్బులు ఉండాలి. కానీ నా ఖాతాలో ప్రస్తుతం రూ.100 ఉన్నట్లు చెబుతున్నారు. అవసరాల కోసమని పొదుపు చేసుకున్నాం. మా డబ్బులు ఖాతాల్లో జమ చేయాలి.
– షేక్ కలీం, చిరు వ్యాపారి, వర్ని

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి



కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సీపీ నాగరాజు

- సీపీ నాగరాజు
- పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో కంటి వెలుగు, వైద్య శిబిరం ప్రారంభం

ఖలీల్‌వాడి: విధుల్లో ఉన్న పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీపీ నాగరాజు సూచించారు. నిజామాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం పోలీస్ శాఖ, జీజీహెచ్ ఆధ్వర్యంలో కంటి వెలుగు, మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీ హాజరై, మాట్లాడారు. విధి నిర్వహణలో పోలీసులు ఆరోగ్యం పట్టించుకోకపోవడంతో ఎన్నో రకాల రోగాలు వస్తున్నాయని తెలిపారు. ప్రతి పోలీసు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. గత మూడేళ్లుగా సిబ్బందికి ఎలాంటి వైద్యపరీక్షలను నిర్వహించలేమన్నారు. ఇకనుంచి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం ఒక్కసారైన ఆరోగ్యం కోసం డాక్టర్లను సంప్రదించాలని సిబ్బందికి తెలిపారు. పోలీసులకు ఏర్పాటు చేసిన కంటి వెలుగు, మెగా వైద్య శిబిరం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం 350 మంది సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, ఏసీపీలు కిరణ్ కుమార్, మధుసుదన్ రావు, సంతోష్ కుమార్, నారాయణ, ఏవోబీ శ్రీనివాస్, రిజర్వు సీఐ అనిల్ కుమార్, శేఖర్, శైలేందర్, వెంకటప్పల నాయుడు, వైద్యులు పాల్గొన్నారు.

తెయూ వీసీని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

నిజామాబాద్ సిటీ: తెలంగాణ విశ్వవిద్యాలయం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, అక్రమాలకు పాల్పడుతున్న వీసీ రవీందర్‌గుప్తాను సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వరభట్టు వేణురాజ్ అన్నారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెయూలో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా 150 మంది ఉద్యోగులను నియమించడం చట్టవిరుద్ధమన్నారు. తెయూలో అవినీతి, అక్రమాలు జరుగుతుంటే జిల్లా మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. వీసీపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేపడతామన్నారు. నాయకులు వినోద్, అరుణ్, లక్కీ, సచిన్ ఉన్నారు.

ఠాణాలో బీఆర్‌ఎస్ నేతల బాహాబాహి



ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌లో కొట్టుకుంటున్న బీఆర్‌ఎస్ నేతలు

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం మండల బీఆర్‌ఎస్ నాయకులు ఒకరికొకరు దూషించుకుంటూ బాహాబాహికి దిగారు. వివరాలు ఇలా.. ఎడపల్లిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీరామ్, సర్పంచ్ భర్త గ్రామ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్ భర్త ఎల్లయ్య యాదవ్, ఎంపీపీ శ్రీనివాస్‌లు ఓ కేసు విషయంలో ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అనంతరం ఎస్సై పాండేరావు సమక్షంలో గ్రామంలో సీసీ కెమెరాల విరాళాల అంశంపై చర్చ జరుపగా.. చర్చ పక్కదారి పట్టి వ్యక్తిగత దూషణలకు దారితీసింది. ఈక్రమంలో ఒకరికొకరు దూషించుకుంటూ ఒకరి గల్లాలు మరొకరు పట్టుకుంటూ కొట్టుకోవడానికి సిద్ధపడ్డారు. వెంటనే స్టేషన్ సిబ్బంది వారిని విడిపించి, బయటకు పంపించారు. మండలంలో వీరి గొడవ చర్చనీయాంశంగా మారింది.

నకిలీ విలేకరిపై కేసు

ఖలీల్‌వాడి: ఓ ప్రముఖ ఛానల్ పేరిట వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ విలేఖరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాలుగో టౌన్ ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్‌కు చెందిన పవన్ కుమార్ గత కొంతకాలంగా వివిధ ఛానళ్లకు చెందిన విలేకరిగా చెప్పుకుంటూ, పలువురిని బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతుండేవాడు. ఈక్రమంలో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి పవన్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. పవన్ కుమార్‌పై జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్: ఒకరి మృతి

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల వద్ద ఓ బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. ముప్కాల్ ఏఎస్సై చిన్నగంగారాం తెలిపిన వివరాలు ఇలా.. వేల్పూర్ మండలం పడిగేల గ్రామానికి చెందిన పడిగే చిన్న మల్లయ్య (50) గురువారం బైక్‌పై సావెల్‌కు వెళ్తుండగా రెంజర్ల వద్ద పసుపు యంత్రంతో వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మల్లయ్య తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే నిజామాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడు..



మృతి చెందిన అజీజ్

కామారెడ్డి టౌన్: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం పట్టణ శివారులోని అడ్లూర్ వద్ద చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ తావునాయక్ తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని బడా మసీద్‌గల్లికి చెందిన అజీజ్(29) బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున ఓ రైల్లో నిజామాబాద్ వైపు వెళ్తుండగా.. రైలు డోర్ వద్ద అజీజ్ ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయి మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. ఘటన స్థలాన్ని పట్టణ పోలీసులతోపాటు, రైల్వే పోలీసులు పరిశీలించారు. మొదట హత్యగా అనుమానించిన తర్వాత, విచారణ అనంతరం ప్రమాదవశాత్తు పడిపోయాడని నిర్ధారణకు వచ్చారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలో బైకు–ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా.. లింగంపేట మండలం ముంబోజీపేట తండాకు చెందిన పరుశురాం, బానోత గోపాల్ బైక్‌పై తండాకు వెళ్తుండగా భవానిపేట సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను కామారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ పరామర్శించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఓ వివాహిత కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాలు ఇలా.. సదాశివనగర్‌లోని బీసీ కాలనీకి చెందిన కరట్లపల్లి సునీత (39), ఇటీవల అప్పు చేసి కూతురు పెళ్లి చేసింది. అప్పుల వల్ల తరచు భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో సునీత మనస్తాపం చెంది గురువారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త రాజు, కుమారుడు ఉన్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం అభివృద్ధి

- తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్
- ముగిసిన అంతర్జాతీయ సదస్సు





ప్రసంగిస్తున్న తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్.. పరిశోధన పత్రాలు సమర్పించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు ,ప్రొఫెసర్లు

తెయూ(డిచ్‌పల్లి): ప్రపంచంలోనే భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాలలో నాణ్యమైన పరిశోధనలతో అభివృద్ధి సాధించినట్లు తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ తెలిపారు. తెయూ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు 'ఇన్నోవేషన్స్ ఇన్ బయోలజీ అండ్ మెడిసిన్' అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ రవీందర్ హాజరై, మాట్లాడారు. ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారిని స్వదేశీ పరిజ్ఞానంతో వ్యాక్సిన్ ఉత్పత్తి చేసి మానవాళికి అందించి ప్రాణాలు కాపాడిన ఘనత భారత్‌కే దక్కిందన్నారు. అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా భారత్‌తో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. యోగి వేమన యూనివర్సిటీ మాజీ వీసీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అత్తిపల్లి రామచంద్రారెడ్డి తన పరిశోధన ఫలితాలను వివరిస్తూ ప్రపంచ కాలుష్య నివారణకు జీవ ఇంధనం ఎంతో మెరుగైందన్నారు. మానవాళి మనగడకు జీవ ఇంధనం విరివిగా ఉపయోగించాలని సూచించారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రజనీష్ అనుపమ్ మాట్లాడుతూ.. వ్యాధుల నియంత్రణలో ఆయుర్వేదం పాత్ర గణనీయమైనదన్నారు. ఉత్తరప్రదేశ్ సీఎస్ఐఆర్ (సెంట్రల్ డ్రగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్)కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ ముఖేష్ మాట్లాడుతూ.. యాంటీ మైక్రోబియల్ ఆక్టివిటీ, పెప్టైడ్ ఉపయోగించి వంద శాతం బ్యాక్టీరియాలను ధ్వంసం చేయవచ్చన్నారు. కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. మానవాళికి దోహదపడే యాంటీ టాక్సిన్స్, ఇన్సులిన్ వంటి ఇంజక్షన్లు, హార్మోన్‌ల తయారీలో బయోటెక్నాలజీ విభాగం ముందంజలో ఉందన్నారు. హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త శశిధర్ మాట్లాడుతూ.. రైతులు పండించే పంటలకు ఆశించే వివిధ రకాలైన క్రిమికీటకాలను ఎరలను ఉపయోగించి అరికట్టవచ్చన్నారు. అనంతరం శాస్త్రవేత్తలను తెయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ సన్మానించారు. పరిశోధన పత్రాలు సమర్పించిన వివిధ రాష్ట్రాల యూనివర్సిటీల పరిశోధక విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సదస్సు కన్వీనర్ మామిడాల ప్రవీణ్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని, బయోటెక్నాలజీ విభాగాధిపతి జవేరియా ఉజ్మా, మహేందర్, కిరణ్మయి, ప్రసన్నశీల తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్టీసీ ప్రోగ్రాం శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆర్‌ఎం ఉషాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రయాణికులు సమస్యలు, సూచనల కోసం కింది ఫోన్ నెంబర్‌లకు డయల్ చేయాలన్నారు.

రీజినల్ మేనేజర్, నిజామాబాద్:	9959226011
డివిజినల్ మేనేజర్, నిజామాబాద్:	9959226013
డిపో మేనేజర్, ఆర్మూర్:	9959226019
డిపో మేనేజర్, బోధన్:	9959226001
డిపో మేనేజర్, నిజామాబాద్–1:	9959226016
డిపో మేనేజర్, నిజామాబాద్–2:	9959226017
డిపో మేనేజర్, కామారెడ్డి:	9959226018
డిపో మేనేజర్, బాన్సువాడ:	9959226020

జిల్లా జడ్జికి పితృవియోగం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల తండ్రి కొండయ్య (73) బుధవారం మృతి చెందారు. గత కొన్నిరోజులుగా కొండయ్య అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. శరీరం సహకరించకపోవడంతో తుది శ్వాస విడిచారు. దీంతో పార్థీవదేహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలుకు తరలించి, గురువారం అంత్యక్రియలు పూర్తిచేశారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్ తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం గణపతి, బార్ కౌన్సిల్ రాష్ట్ర సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి సంతాపం తెలిపారు.

యాప్ పేరుతో సైబర్ మోసం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఓ యువకుడు యాప్ పేరుతో సైబర్ మోసానికి గురైయ్యాడు. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పెద్దబీర సుభాష్ రావుకు ఈ నెల 22న గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ క్రెడిట్ కార్డులో డేటాఫ్ బర్త్ తప్పుగా ఉన్నదని, వెంటనే సరి చేయాలన్నాడు. ఇందు కోసం ఒక యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని, ఫోన్‌పే వివరాలను పంపాలని తెలిపాడు. బాధితుడు అలాగే చేయడంతో తన అకౌంట్ నుంచి రూ.లక్షా 6వేల910 విత్‌డ్రా కావడంతో అవాక్కయ్యాడు. వెంటనే సదరు ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా కలవలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బైక్ చోరీ: నిందితుడి అరెస్టు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఓ బైక్ చోరీకి గురికాగా.. నిందితుడిని అదుపులోకి తీసుకొని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన సింగిల్ విండో సీఈవో కమ్మరి సందీప్ బైక్ బుధవారం చోరీకి గురైంది. గురువారం అతడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. బైకు దొంగిలించిన వ్యక్తిని గుర్తించి, అదుపులోకి తీసుకొని బైకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బంజారాల అభ్యున్నతికి సీఎం కృషి

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- భీమ్‌గల్‌లో బంజార భవన్ ప్రారంభం



బంజార భవన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్: రాష్ట్రంలో బంజారాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ముగింపు ఉత్సవాల్లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 2400 గిరిజన తండాలను ఏకకాలంలో గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి, బంజారాలకు పెత్తనం ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే చెందుతుందన్నారు. గ్రామ పంచాయతీల భవన నిర్మాణాల కోసం రూ. 20 లక్షల చొప్పున నిదులు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం భీమ్‌గల్‌లో బంజారా భవన్‌ను ప్రారంభించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. యువత సంత్ సేవాలాల్ చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రేమలత, ఎంపీపీ మహేష్, జెడ్పీటీసీ రవి, జెడ్పీ కోఆప్షన్ మోయిజ్, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



సమావేశంలో మాట్లాడుతున్న ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి

నిజామాబాద్‌నాగారం: ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించడం వల్ల మానసిక ఉల్లాసం, ఉత్తేజం పొందుతారని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి తెలిపారు. నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను గురువారం ఆయన తిలకించారు. ఈసందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్‌ను, క్రీడాకారులను అభినందించారు. టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు ప్రతియేటా క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. కార్యదర్శి అమృత్‌కుమార్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, జాకీర్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

సెమీఫైనల్ మ్యాచ్‌లు ఇలా...

- మొదటి సెమీస్‌లో ఆర్‌అండ్‌బీ– ఏఎంసీ శాఖలు పోటీపడగా.. ఆర్‌అండ్‌బీ జట్టు విజయం సాధించి, ఫైనల్‌కు వెళ్లింది.
- రెండో సెమీస్‌లో ఇరిగేషన్–అగ్రికల్చర్ శాఖలు పోటీపడగా.. అగ్రికల్చర్ జట్టు గెలిచి, ఫైనల్‌కు వెళ్లింది.

నేడు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రాక..

రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేడు జిల్లాకు రానున్నారు. శుక్రవారం ఉదయం 11.30గంటలకు నూతన కలెక్టరేట్ ఆవరణలో టీఎన్జీవోస్ క్రీడల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

మెడికల్ కళాశాలకు కుటుంబరావు మృతదేహం



మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబరావు కుటుంబ సభ్యులు

నిజామాబాద్ సిటీ: వైద్య కళాశాల పరీక్షల నిమిత్తం పరుచూరి కుటుంబరావు మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు మెడికల్ కళాశాలకు అప్పగించారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నగర కార్యదర్శి, న్యాయవాది పరుచూరి శ్రీధర్ తండ్రి పరుచూరి కుటుంబరావు బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన కళ్లను లయన్స్ క్లబ్‌కు అందజేశారు. అనంతరం మృతదేహాన్ని గురువారం ప్రభుత్వ వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అందజేశారు. నాయకులు గొర్రెపాటి మాధవరావు, వెంకటరామయ్య, నారాయణరావు, రమేష్ బాబు, ఆకుల పాపయ్య. భూమయ్య. న్యూడెమోక్రసీ నిజామాబాద్ డివిజన్ నాయకుడు వేల్పూర్ భూమయ్య, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో కుటుంబరావు భౌతిక కాయాన్ని అందజేశారు.